వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కస్తూరి నరేందర్

మణికొండ: ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు వ్యాయామం, వాకింగ్, జాగింగ్ చేస్తూ ఆరోగ్యవంతంగా ఉండాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. అంజలి గార్డెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏరేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. అధ్యక్షుడు జితేందర్, కౌన్సిలర్లు పురుషోత్తం, సీనియర్ నాయకులు పురుష్తోం, అధ్యక్షులు హనుమంత్‌కుమార్, రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భట్టి విక్రమార్క పుట్టిన రోజు

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు గాంధీభవన్‌లో జరిగిన ఆయన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మైలారం సులోచన తదితరులు డిప్యూటీ సీఎంను ఆయన ఇంటి వద్ద కలిసి బొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రాణించిన జిల్లా రెజ్లర్లు



పతకాలు సాధించిన రెజ్లర్లను అభినందించిన అసోసియేషన్ నాయకులు

మణికొండ: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో రంగారెడ్డి జిల్లా రెజ్లర్‌లు సత్తా చాటి అత్యధిక పతకాలను సాధించారు. హైదరాబాద్ నగరంలోని యాకుత్‌పురాలో ఆదివారం జరిగిన పోటీలలో జిల్లాకు చెందిన అండర్–15 బాలుర ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్‌స్టైల్, మహిళా రెజ్లింగ్ పోటీలలో క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో మూడు బంగారు, 6 వెండి, 6 కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి, టీం కోచ్ కె.రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాండు, సీనియర్ రెజ్లర్ శ్రీధర్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనాదిగా రెజ్లింగ్ పోటీలలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక పతకాలను సాధించిన ఘనత జిల్లాకు ఉందన్నారు. భవిష్యత్‌లోనూ అదే ఒరవడి కొనసాగించాలని ఆకాంక్షించారు.

మణికొండలో ఘనంగా ఫాదర్స్ డే

మణికొండ: మణికొండ సేవియర్స్ లూథెరన్ చర్చ్ ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి సంఘం పాస్టర్ రెవరెండ్ దయారత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయారత్నం మాట్లాడుతూ... తండ్రుల పాత్ర గొప్పదని, వారు కుటుంబానికి ఆధార స్తంభాలుగా ఉంటారన్నారు. తండ్రి హృదయం నుంచి వెలువడే ప్రార్థన దేవుని చెవిని చేరుతుందన్నారు. సంఘం అధ్యక్షుడు కురమ ప్రతిభారాజు, ఉపాధ్యక్షుడు తెలగతోటి డేవిడ్‌స్వరూప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్ధనపు అదిరాజు, కోశాధికారి వెలగపల్లి డేవిడ్, సభ్యులు రాయి నటరాజ్, మాదాసు శరత్, జాన్ మోజెస్, మార్టన్, విజయసాగర్, రాజ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

'మనూ' పరిశోధక విద్యార్థి ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ



ఫజలుద్దీన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి సయ్యద్ ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగంలో ఫజలుద్దీన్‌కు పీహెచ్‌డీని ప్రకటించారు. ఆయన మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం ప్రొఫెసర్ బదీయుద్దీన్ పర్యవేక్షణలో 'అమ్మకాలు, వ్యక్తిగత శిక్షణ, అభివృద్ధి పద్ధతులు: ఎంపిక చేసిన ఆటోమొబైల్ కంపెనీల అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను రూపొందించి సమర్పించారు. దీన్ని పరిశీలించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటిస్తున్నట్లు 'మనూ' పరీక్షల కంట్రోలర్ విభాగం వివరించింది.

కాలకృత్యాలకూ కనాకష్టమే!

- నిత్యం వందలాదిగా ప్రయాణికుల రాకపోకలు
- టాయిలెట్లు లేక ప్రజల ఇబ్బందులు
- మహిళల పరిస్థితి వర్ణనాతీతం



టాయిలెట్‌లు ఏర్పాటు చేయాల్సిన డెయిరీఫాం, చింతల్‌మెట్ చౌరస్తాలు

శాస్త్రిపురం: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు, వాహనదారులకు ఏదైనా అత్యవసరమైతే కనుచూపుమేరలో టాయిలెట్లు ఉండవు. ఓపిక పట్టాలి.. అనువైన చోటకు పరిగెత్తాలి.. లేదా ఖాళీ స్థలం చూసుకోవాల్సిందే. మహానగరంలో విలీనమై సంవత్సరాలు గడుస్తున్నా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో బయో టాయిలెట్ల జాడే లేదంటే స్థానికంగా ప్రజల ఇబ్బందులు ఎంత దుర్భరంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

- సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో మురుగుదొడ్లు లేక పరిస్థితి గందరగోళంగా తయారవుతోంది. బయోటాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో బహిరంగంగానే పలువురు మూత్ర విసర్జన కానిచ్చేస్తుంటారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా.. దుర్గంధభరితంగా మారుతున్నాయి.
- చింతల్‌మెట్, ఎంఎం పహాడీ, డైరీపాం, శాస్త్రిపురం, కింగ్‌సకాలనీ, హసన్‌నగర్ చౌరాస్తా, ఇంద్రానగర్ తదితర ప్రాంతాలలో నిత్యం వేలాదిగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా ప్రాంతాలలో వాణిజ్య, వ్యాపార సముదాయాలు, కళాశాలలు, ఇతర షాపింగ్ మాల్‌లు పెరిగిపోవడంతో ఆస్థాయిలోనే ప్రజలు, వాహనాల రద్దీ అలాగే ఉంటుంది.
- ఇక్కడి బస్టాపుల నుంచి విద్యార్థులు ఇతర ప్రాంతాలలో చదువుకునేందుకు వెళ్తుంటారు. ఆయా ప్రాంతాలలో ఎక్కడా బయోటాయిలెట్లు లేవు. ఫలితంగా ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు ఎంతో అసౌకర్యంగా ఉంటుంది.
- గతంలో చాలాసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు బయోటాయిలెట్ల ఏర్పాటు కోసం ప్రజలు వినతి పత్రాలు సమర్పించినా అవికాస్తా బుట్టదాఖలయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రహదారులపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు మలమూత్ర విసర్జనకు అవకాశం లేకుండా ఉండటంతో ప్రత్యక్షంగా నరకయాతనను చవిచూస్తున్నారు. ఉదయం నుంచి తాము రోడ్లపై వ్యాపారం చేసుకుంటున్నామని ఆయా ప్రాంతాల్లో టాయిలెట్లు లేనందున ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచడం లేదని వ్యాపారి సయ్యద్ ఖురేషీ ఆవేదన వ్యక్తం చేశారు.
- డెయిరీఫాం, చింతల్‌మెట్ చౌరస్తాలలో ప్రయాణికుల సౌకర్యార్థం టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే వాటి నిర్వహణను తాము చూసుకుంటామని పలువురు చెబుతున్నారు. ఇకనైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా బయోటాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





రోడ్డు పక్కనే ఇలా..

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 1వ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాలనీ అసోసియేషన్ సభ్యులు వారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన వారు మాట్లాడుతూ... కాలనీలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

కార్మిక ధర్నాను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న జాతీయ కౌన్సిల్ సభ్యుడు మల్లేష్

మణికొండ: స్టేట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మల్లేష్ పిలుపునిచ్చారు. గండిపేట మండలం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. బీకేసీ మండల కార్యదర్శి బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఏఐటీయూసీ అనేక పోరాటలతో 1996లో భవన నిర్మాణ కార్మికుల కోసం తీసుకొచ్చిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ప్రైవేటు ఇన్సూరెన్స్‌కు అప్పగిస్తే భవన నిర్మాణ కార్మికులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన స్టేట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వేలాదిగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు శంకరయ్య, మండల కార్యదర్శి స్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుంటూ వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆదివారం శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు. శ్రీరామ్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్ బస్తీలలో తిరిగి ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... కాలనీలలో ఎక్కడ చూసినా మురుగు నీరు నదులను తలపించేలా రోడ్లమీదే ప్రవహిస్తున్నాయన్నారు. మ్యాన్‌హోల్స్ నుంచే కాకుండా నివాసాల మధ్య నుంచి కూడా మురుగు ప్రవహిస్తూ చాలా ఘోర పరిస్థితి నెలకొందన్నారు. చెత్తాచెదారం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించనందున అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉదన్నారు. విద్యుత్ స్తంభాలు సైతం రోడ్డుకు అడ్డుగా ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సగానికి విరిగిన స్తంభాలు ప్రమాదాలు కల్గిస్తున్నాయన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులను కలిసి సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. నేతలు రాముయాదవ్, రాఘువేందర్‌యాదవ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, రాజేష్‌యాదవ్, ఎడ్లకాడి సూర్యం, మైసిరెడ్డి, జి.రాజు, జగదీష్, వెంకటరమణ, చిరంజీవి, భూదేవి, అరుణరెడ్డి, సరిత, ఎగె శ్రీకాంత్, అనిల్, మహేష్, అశోక్‌కుమార్, సందీప్‌గుప్తా, సునీల్, రాజు, క్రాంతి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



సి.ప్రజ్ఞీత్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు కనిపించకుండా పోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతానికి చెందిన సి.ప్రజ్ఞీత్‌రెడ్డి(14) ఆదివారం ఉదయం ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ప్రయోజనం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామ బొడ్రాయి ఎనిమిదవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బుద్వేల్ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

బెదిరిస్తున్నారంటూ ప్రజల ఆందోళన



ఆందోళన చేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

మణికొండ: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పక్షపాతం చూపటంతో పాటు వాటిని తెలిపిన వారిని వేధించటం, బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలంటూ వెంకటేశ్వర కాలనీ ప్రజలు ఆదివారం రోడ్డెక్కారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన కొందరు ప్రజలు తమ అపార్ట్‌మెంట్‌ల ముందు రోడ్లు, వేయకుండా, వీధి దీపాలు ఏర్పాటు చేయకుండా కాలనీ అసోసియేషన్, మాజీ కౌన్సిలర్‌లు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాలనీ బైలాస్ ప్రకారం సమావేశాలు నిర్వహించటం, తీర్మానాలు చేయకుండా ఏకఛత్రాధిపత్యంగా వారికి నచ్చిన పనులనే చేస్తున్నారన్నారు. అసోసియేషన్ కాల పరిమితి దాటినా కొత్త కమిటీని ఎన్నుకోవటం లేదన్నారు. కాలనీ అసోసియేషన్‌లో ఉన్న వారు బైలాస్ ప్రకారం రాజకీయ పార్టీల్లో ఉండవద్దని ఉన్నా పట్టించుకోవటం లేదన్నారు. దేవాలయ నిర్మాణానికి ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ఇప్పటి వరకు లెక్కలు చెప్పలేదన్నారు. మాజీ కౌన్సిలర్‌కు సమస్యలు గతంలో సమస్యలు తెలిపితే అసోసియేషన్ వారు అడిగిన పనులే చేస్తానని, వారిని కలుపుకొని రావాలని పెత్తనం చేశారన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్‌లు నిర్మించే భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉండగా ఇతరుల భవనాలపై మాత్రం వారు ఫిర్యాదులు చేసి వేధిస్తున్నారన్నారు. ఇకనైనా వారి తీరు మార్చుకోవాలని, వెంటనే నూతన కమిటీని ఎన్నుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యువకుల అరెస్టు అక్రమమంటూ ధర్నా



ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ ప్రాంతంలో బక్రీద్ పండగ మరుసటి రోజు రాత్రి కళేబరాలను తరలిస్తున్న డీసీఎం లారీలను అడ్డుకున్న సంఘటన, అత్తాపూర్ డివిజన్‌లోని పాండురంగానగర్‌లో ఆవులను వధించడానికి తీసుకెళుతుండగా అడ్డుకున్న హిందూ యువకుల అరెస్టులను నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, గోరక్ష, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో యువకులపై అక్రమ కేసులను రద్దు చేయాలని... పెట్టిన కేసుల్లో సెక్షన్లను మార్చాలని ఇకపై అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమంగా చట్ట వ్యతిరేకంగా జంతువు కళేబరాలను తరలిస్తున్న డీసీఎం యజమానులపై, వాటి నిర్వాహకులపై కేసులు పెట్టాలన్నారు. పోలీసులు ఒక వర్గంపై మాత్రమే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయాలపై హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు డీసీపీ అందుబాటులో లేకపోవడంతో ఏసీపీకి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు రమేశ్ బాబు, గోరక్ష ప్రముఖ్ విశాల ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్ యాదవ్, ముఖేశ్ యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్ యాదవ్, డీజే శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, వై.శ్రీధర్, ఎన్.మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కొముర‌య్య, భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశప్రగతి



మైలార్‌దేవ్‌పల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగి రవిలు అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయన్నారు. నరేంద్రమోదీ పదవీ కాలంలో 11 సంవతసరాలుగా అనేక సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. నేతలు అడికే రాజు, బొమ్మ రాజ్‌నర్సింహ్మా, రావుల భాస్కర్, నవారు మురళీధర్‌రెడ్డి, వల్లూరు శ్రీనివాస్, జి.శ్రావణ్‌కుమార్, ఎం.ప్రభాకర్, అడికే మహేందర్, బాల శ్రీనుయాదవ్, గూడూరు అంజి, శివశంకర్, పవన్, అడికే అభిలాష్, కొండల అంకిత్, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 2,046 కేసుల పరిష్కారం



కేసులను పరిష్కరిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నీలిమ

రాజేంద్రనగర్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2,046 కేసులను పరిష్కరించారు. ఇందులో రాజీపడిన 274 కేసులు, అడ్మిషన్ కేసులు 423, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 957, సైబర్ క్రైమ్ కేసులు 118, ఈ–పెట్టీ కేసులు 274లను పరిష్కరించారు. కార్యక్రమంలో 13వ అదనపు న్యాయమూర్తి నిష్క పాత్రుడు, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్, ఏపీపీ ప్రవీణ్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసోజు యాదగిరి, కార్యదర్శి బందయ్య, లోక్ అదాలత్ సభ్యులు వెంకట్ రెడ్డి, సుదర్శన్, సుధాకర్ రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, జ్ఞానేశ్వర్ చారి, తలారి శ్రీశైలం, కోర్టు సిబ్బంది రవీందర్, వెంకటరంగారెడ్డి, మంజుల, సునీత, నరేశ్ గౌడ్, ఠాణాల ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి, పల్లెచెరువు, బీకే పురా, రాగెల్ గార్డెన్, శక్తి ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆయాషా కాలనీ, అలీనగర్, అహ్మద్‌నగర్, కింగ్స్ ఎవెన్యూ, యూసుఫ్ గుల్షన్ కాలనీ, హషామాబాద్ టవర్ గల్లీ, రాగెల్ గార్డెన్, గుమ్మడి కృష్ణారెడ్డినగర్, సుభాన్ కాలనీఫేస్–1, 2, వినాయక్‌నగర్, పల్లెచెరువు, అబ్దుల్లా కాలనీ, జహింగీరాబాద్, రహమత్ కాలనీ, లక్ష్మీగూడ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. గ్రీన్‌విచ్ ఫీడర్లల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ, అబ్దుల్లా కాలనీ, మిలహా నగర్, జహంగీరాబాద్, లింక్‌సిటీ, పటేల్‌నగర్, హరిజన బస్తీ, రాజీవ్‌గాంధీనగర్, దస్తగిరినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వివరించారు.

రాజేంద్రనగర్ పరిధిలో...

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. సహారా హోమ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. పర్మారెడ్డి హిల్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.10 గంటల వరకు, బాసిత్ బాబానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. జలాల్ బాబా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు అధికారులు వివరించారు.